# పిప్పరమెంట్

కాపురమంటే కాంట్రాక్టు బిజినెస్సా?

భార్య అంటే కేవలం వంట మనిషి...పని మనిషి.... అంతేనా?

ఒకే ఇంట్లో ఆలుమగలకు రెండు బెడ్‌రూములా?

కొత్త దంపతులు రోజూ కలిసి గడిపేది అయిదూ పది నిమిషాలేనా? లోకంలో పెళ్ళిళ్ళన్నీ ఇలాగే జరుగు తున్నాయా? కాపురా లంటే ఇలాగే ఉన్నాయా?

షాక్ మీద షాక్ తగిలిన ట్లవుతోంది జయంతికి.

లక్షణమైన సంబంధం.

అబ్బాయి లక్షలు సంపాయిస్తున్నాడు.

చిన్న వయసు లోనే పెద్ద పెద్ద వ్యాపారాలు చేస్తున్నాడు. భవిష్యత్తులో కోట్లకు పడ గెత్తు తాడు. పరిశ్రమలు పెడతాడు. పేరు ప్రతిష్ఠల కేమీ లోటు ఉ ండదు.

వ్యక్తి మంచి వాడు. తల్లి పెంపకంలో పెరిగాడు. తండ్రి లేని లోటేమీ లేదు. దుర్వ్యసనాలు మచ్చుకైనా లేవు. లేచిందే లేడికి పరుగు అన్నట్టు క్షణం అయినా ఊరుకోడు. గడియారంతో పోటీ పడతాడు.

సుందరం ఏ ఆడ పిల్ల కైనా నచ్చే వరుడే. సందేహమే లేదు. దబ్బ పండు చాయ. గమ్మత్తుగా మెరిసే కళ్ళు. చాలా తక్కువ మాట్లాడతాడు. కాని బాంబుల్లా జోకులు పేలుస్తాడు.

సరదా తెలీని మని షను కోవడానికి లేదు.

పెళ్ళి వేడుకల్లో గమనించింది.

సాక్షాత్తూ మగ మహారాజు అతను. బంధువర్గంలో అతన్ని పొంద లేని అమ్మాయి లందరూ అతన్ని ఎంత ఆర్తిగా చూసుకున్నారో ఇంకా గుర్తుంది.

తన ఫోటో చూసి ఇష్టపడ్డాడు.

పెళ్ళి చూపుల్లో ఏమీ మాట్లాడ లేదు. ఏమీ అడగ లేదు. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. అంతే.

జగదీశ్వరమ్మ సగర్వంగా చెప్పుకుంది....

"మావాడు నేనెంత చెప్తే అంతే..."

అంతేలా ఉంది. అంతా బాగుంది.

ఇల్లు సాక్షాత్తూ వైకుంఠం.

నౌకర్లూ చాకర్లూ....ఒకటి కాదు....రెండు కార్లు. తల్లి ఇష్టం వచ్చినప్పుడు బైటి కెళ్ళడానికి ప్రత్యేకంగా ఇంకో కారు కొన్నాడు.

వంటింట్లో పొయ్యి ముట్టించి గరిటలు తిప్పడమే తన వంతు. మిగతా అన్నిటికీ పని మనుషులే. తనను రాణిలా చూస్తారు. దేవతే అనుకుంటారు. ఎదురు చెప్పరు. చేతులు కట్టుకుని మాట్లాడతారు.

గొప్పగా ఉంది. మబ్బుల్లో తేలిపోయే జీవితం.

కాని ఒకే కొరత. లోటు! ఘోరం....

ఎవరితో ఎలా చెప్పుకోవాలి?

పెళ్ళయిన తర్వాత....శోభనం రాత్రే...గొప్ప డిజప్పాయింట్‌మెంట్. అసలు ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు.

సుందరం తన నేమీ నిర్లక్ష్యం చెయ్య లేదు. అయిష్ట మేమీ లేదు. ప్రియంగా చూశాడు.

ప్రేమగా దగ్గరకు తీసుకున్నాడు. చాలా చిర పరిచితు రాల్తో మాట్లాడి నట్లు కుశల ప్రశ్నలు వేశాడు.

పెళ్ళి అనేది జరిగి పోయింది.

మనం కలిసి ఉంటున్నాం. ఎప్పుడూ విడిపోము. మనం ఒకరి కొకరం. ఈ సెంటిమెంట్ అంతా అతని వాలకం లోనే స్పష్టంగా తెలిసి పోయింది.

దగ్గరకు తీసుకున్నప్పుడు అతనేమీ కంగారు పడలేదు. ఇది వరకే ఇతర స్త్రీలతో అనుభవా లున్నాయేమో అన్నంత తేలిగ్గా ప్రవర్తించాడు. చిన్న ముద్దులు. కౌగిలింతలు. కొంచెం ఆరాటం.

కొత్తదనం వల్ల కాస్త మొహమాట పడే ఫీలింగ్. అంతే. ఆ తర్వాత కాస్సేపు పడుకుని నిద్ర పోయాడు. తనకూ మగత నిద్ర పట్టేసింది.

మెలకువ వచ్చి చూసే సరికి లైటు వెలుగు తోంది.

సుందరం దూరంగా సోఫాలో కూచుని ఏవో ఫైళ్ళూ కాయితాలూ

ముందేసుకుని తిరగే స్తున్నాడు.

అతన్ని చూస్తే ముచ్చ టేసింది.

తను మేలుకోవడం చూసి, చిన్నగా నవ్వాడు.

లేచి పాలు తీసుకెళ్ళి ఇచ్చింది.

తల పక్కకి వాల్చి చూశాడు. "లాంఛనమని పెట్టా రేమో గాని నేను మామూలుగా తాగను" అంటూ గ్లాసు అందుకుని తాగేశాడు. "ఇంకెప్పుడూ ఇవ్వకు" అంటూ గ్లాసు పక్కన పెట్టేశాడు.

తను సోఫాలో అతని పక్కన కూచుంది. ఇబ్బందిగా చూశాడు. భుజాన్ని తాకబోతే సున్నితంగా పక్కకి జరిగాడు. "నాకు చాలా పనుంది. ప్రొద్దున్నే కాన్ఫరెన్స్ ఉంది. ప్లీజ్ ... నువ్వెళ్ళి పడుకో" అన్నాడు.

భయ మేసింది.

భయ పెట్టడానికి అర వక్కర్లేదు. కర వక్కర్లేదు. నన్ను తాక నవసరం లేదన్నట్లు దూరం జరిగితే చాలు.

పడుకుందే గానీ నిద్ర పట్ట లేదు. ఏమీ తోచ లేదు. రాక్‌లో పుస్తకా లున్నాయి గాని వాటిని తాకా లనిపించ లేదు. టీవీ ఉన్నా ఆన్ చెయ్యా లనిపించ లేదు.

దేని వల్లా అతను డిస్టర్బ్ కాకూడదు.

వృత్తి మీద అతని కున్న శ్రద్ధ, భక్తి చూస్తే విపరీత మైన గౌరవం కలిగింది. ఎంత గొప్ప వ్యక్తి! పెళ్ళయిన మొట్ట మొదటి రోజు, కోరి ఇష్టపడి చేసుకున్న భార్యతో మరి కాస్త టైము సరదాగా సరసంగా గడపాలని అతనికి లేదు. ఎంత దీక్ష అతనికి!

అతని దీక్షను పరీక్షించ డానికా తను అతని భార్య అయింది? అతని విషయాల్లో తనూ భాగస్వామి అయితే అంతకన్న కావలసిం దేముంది?

అర్థ రాత్రి దాటింది. బెడ్ మీద అలా పడి పోయింది. అతని కేసి అప్పుడప్పుడూ చూస్తూనే ఉంది.

కాస్సేపు నిద్ర. కాస్సేపు మెలకువ.

మెదడు నిండా బారులు తీరిన ఆలోచనలు.

వైవాహిక జీవితం మీద తన మధుర స్వప్నాలు ఏం కావాలి? ఇరవ య్యేళ్ళ నిండు యౌవనం శరీరం నిండా నింపిన బరువులు తీర్చిన వొంపులు పొదిగిన మాధుర్యాలు ఒలికిస్తున్న కైపులు ఇవన్నీ వృథాయేనా?

ఋష్యశృంగుడికి తప్పలేదు.

విశ్వామిత్రుడు తపస్సు పక్కన పెట్టాడు.

స్త్రీ కన్న గొప్ప మైకం, సుఖం, ఆకర్షణ, స్వర్గం పురుషుడికి మరొకటి ఉందా?

మరుసటి రాత్రులూ అతను మారతా డనుకుంది. బిజినెస్ ఒత్తిడి కాస్త తగ్గితే తనను మరింత అపురూపంగా చూసుకుంటా డనుకుంది.

అంతా కల్ల.

అతని స్వభావం షేర్ మార్కెట్ లాంటిది. వస్తువు విలువ, డబ్బు విలువ, టైము విలువ....అంతే అతనికి తెలిసినవి. అవే కావలసినవి. అప్పటికీ అనుకుంది శోభనాల తంతూ లాంఛనాలూ ముగిశాక ఇల్లూ సంసారమూ తన చేతుల మీదుగా జరిగితే.... అంతా దారికి వస్తా యనుకుంది.

ఇక్కడ మరో షాక్.

వంట గదిలో వంటా గరిటా మాత్రమే తనవి.

మిగతా అంతా అత్త గారి పెత్తనమే.

ఎప్పుడేమి వంటలు చెయ్యాలో అంతా జగదీశ్వరమ్మే డిసైడ్ చేస్తుంది. అందులో సుందరం ఇష్టం కూడా ఏమీ ఉండదు. ఆర్డర్ ప్రకారం పని మనుషులు అన్నీ చేసుకు పోతుంటారు.

బొడ్లో తాళాలు దోపుకుని మధ్య హాలులో సోఫాలో కూచుంటుంది జగదీశ్వరమ్మ. మహారాణిలా ఉంటుంది. గంభీరంగా ఉంటుంది. నిజంగా ఆమెను అలా చూస్తే పరమ గౌరవం, భక్తీ కలుగుతాయి. ఎన్నెన్ని ఒడిదుడుకుల్ని తట్టుకుని కొడుకుని ఎంత వాణ్ణి చేసింది! అద్భుత మైన వ్యక్తి. సందేహమే లేదు.

రోజూ ప్రొద్దున్నే తయారయి పూజ గదిలో దేవతలకూ, తండ్రి ఫోటోకూ నమస్కరించి తల్లికి పాదాభి వందనం చేస్తాడు సుందరం.

ప్రేమగా అతని శిరస్సు తాకి లేవనెత్తి ఆ రోజు చెప్పవలసిన వేవైనా ఉంటే చెప్తుంది ఆమె.

స్వయంగా డైనింగ్ రూమ్‌లోకి తీసుకెళ్ళి దగ్గరుండి వడ్డిస్తూ తినిపిస్తుంది.

పని మనుషులు అందిస్తూ ఉంటారు.

జయంతి మరి కాస్త దగ్గరుండి అందించాలి. అంతే.

సుందరంతో చనువుగా మాట్లాడ్డం గాని, వడ్డనలో జోక్యం చేసు కోవడం

గాని ఉండవు.

ఆ ఇంట్లో అన్నిట్లో ఇదే పద్ధతి అని వెంటనే అర్థమై పోయింది జయంతికి.

ఇదేదో వేరే లోకం. వేరే ప్రపంచం. భోగ భాగ్యాలు శ్రమశక్తి పోటీ పడే చోట ఇలాగే ఉంటుం దనుకుంది. దీన్ని మార్చ లేము. మార్చి సాధిం చేదీ లేదేమో.

కాని వీ టన్నింటినీ తల దన్నేది ఆఖరి షాక్.

రెండు బెడ్‌రూమ్‌ల షాక్.

మేడమీద సుందరం గది ప్రక్కనే తన కోసం ఒక గది కేటాయించారు. ఏ లోటూ లేదు. అన్నీ వున్నాయి. టీ వీ, వీ సీ పీ లు కూడా ఉన్నాయి. ఫోన్ ఎక్స్‌టెన్షన్ కూడా ఉంది. ఏం చేసుకోను?

ఇంటిలో సెటిల్ అయిన రోజున, భోజనాల తర్వాత అతని గది లోకి వెళ్ళింది.

ఎందు కొచ్చా వన్నట్టు చూశాడు.

కాయితాలూ, లెడ్జెర్లూ, ఫైళ్ళూ అవెప్పుడూ ముందే ఉంటాయి. "నే నొస్తానుగా... నువ్వెళ్ళు" అన్నాడు.

దిక్కు తోచకుండా వెళ్ళి గదిలో పచార్లు చేస్తూ గడిపింది. ఇంటి గోడలు బద్దలు కొట్టెయ్యా లన్నంత కసి, కోపం. ఒక వస్తువును పారేసి నట్టు శరీరాన్ని బెడ్ మీద పడేసింది.

మల్లె పూలు, బైట వెన్నెల, చల్ల గాలి.... అల్లరి పెట్టే వయసు.... ఇవన్నీ ఏం చేసుకోను?

ఈ మనిషి ఇంతేనా? వయసూ వేడీ కోరికా ఉన్నా డబ్బు కట్టలకి జీవితాన్ని తాకట్టు పెట్టిన మూర్ఖుడా? అనుభవించడ మంటేనే ఏమిటో తెలీక పోతే ఈ వైభవా లన్నీ ఏం చేసుకోను? పదకొండు గంట లప్పుడు తలుపు నెమ్మదిగా చప్పు డైంది.

రాముడు మంచి బాలుడు అన్నట్టుగా వచ్చాడు.

"నిద్ర పోలేదా? టీవీ అయినా పెట్టుకోక పోయావా?" అన్నాడే గాని ఎందుకు నిద్ర పోలేదో అడగనే లేదు. అతను టీవీ పెట్టకూడదా! ఇద్దరూ కలిసి డెక్‌లో మంచి కేసెట్ చూడకూడదా!

అతనికి అటువంటి ఆలోచనలే రావు.

"అమ్మ కూడా చెప్పింది ...నీకు బోర్‌గా ఉంటుందని...రేపట్నుంచి

ఎవరో ఒకరు లేడీస్ వస్తుం టారులే. లేడీస్ క్లబ్‌కి అమ్మే ప్రెసిడెంట్. అందరూ పెద్ద పెద్ద వాళ్ళు. వాళ్ళ అమ్మాయిలతో నీకు స్నేహాలు కుదిర్తే బోర్ తగ్గుతుంది...." అంతకు మించి చెప్పేదేమీ లేదన్నట్టు మాటలు ఆపేశాడు.

దగ్గరకు తీసు కున్నప్పుడు కోరిక కేమీ లోపం లేదు. ఆర్తి ఉంది. అల్లుకోవా లని ఉంది. అపురూపంగా చూసుకోవాలని ఉంది.

ఖరీదైన బట్టల క్రింద సృష్టి శిల్పం మూగగా పలవరిస్తోం దని అతనికి తెలియదా?

ఏదో టైమై పోయినట్టు బిజినెస్ మీటింగ్‌కి వెళ్ళినట్టు తనని తిప్పు కున్నాడు. అప్పుడే గమనించింది.

అతను నోట్లో ఏదో చప్పరిస్తున్నాడు.

వాసన కొంచెం ఘాటుగా తగిలింది.

ముద్దులో తీపి కన్నా వగరు ఎక్కు వనిపిం చింది.

ముద్దులు ముగిసే లోపే ముచ్చట కూడా తీరి పోయింది. తన పెదవుల మీద కూడా ఆ వగరు మిగిలింది. తను వింతగా పెదవులు తడిపి రుచి చూసుకుంటూ ఉండగా అతను చెప్పాడు...

"పిప్పరమెంట్ లే....స్ట్రాంగ్ పిప్పరమెంట్! నాకు అలవాటు" అన్నాడు చిన్న పిల్లవాడిలా!

ఎంత గొప్ప దుర్వ్యసనం! మగాడికి ఏదో ఒక వ్యసనం ఉంటేనే తమాషాగా ఉంటుంది.

కాని పిప్పరమెంటా?

మహాత్మా గాంధీని చూస్తే, రవీంద్రనాథ్ ఠాగూర్‌ని చూస్తే, అబ్రహాం లింకన్‌ని చూస్తే ..వీళ్ళు పెళ్ళాల్తో సరదాగా, సంతోషంగా, సరసంగా కాపురం చేసి ఉంటారా అనిపిస్తుంది అన్న దొక పెద్దావిడ.

ఇప్పుడు సుందరాన్ని చూసినా అటువంటి అభిప్రాయమే కలుగు తోంది జయంతికి. ఇది వరమో శాపమో తెలియని అయోమయంలో కొట్టు మిట్టాడు తుండగా హఠాత్తుగా మెరుపు కొట్టిన ట్లయింది.

ఏదో చిన్న పిల్లవాడి తాయిలం లా సుందరం చప్పరించే పిప్పరమెంట్.

మామూలు పిప్పరమెంట్ కాదు. స్ట్రాంగ్ పిప్పరమెంటా? డైనమైట్ అది!

ఆ వేళ మధ్యాహ్నం జయంతి మేడ మెట్లు దిగి హాల్లోంచి లోనికి

వెళ్తుండగా జగదీశ్వరి ప్రైవేట్ రూమ్ లోంచి చిన్నగా మాటలు వినిపించాయి.

ఎవరో పెద్దావిడ జగదీశ్వరిని తెగ పొగిడేస్తూ ఊదర గొట్టేస్తోంది. "ఇన్నాళ్ళూ ఇల్లూ, బిజినెస్సూ కమాండ్ చేశావమ్మా. పెళ్ళి చేస్తే ఇవన్నీ కొడుకు కోడలి ఒళ్ళో పోసెయ్యడం సహజం కదా? నెలన్నర దాటింది. ఆ చాయైనా లేదు. అందరూ నీ గురించి ఎంత గొప్పగా చెప్పుకుంటున్నారో తెలుసా? పెళ్ళా మంటే బెల్లం అవాలి కాని నువ్వేమిటో మంత్రం వేసి కోడలంటే ఇంటి గోడ లంత ఎడంగా ఉంచు తున్నావు....ఏమిటో కిటుకు చెప్ప రాదా?"

"సుభద్రా....ఎలిమెంటరీ స్కూలు ఫ్రెండువి నీతో చెప్పకేం గాని ....అబ్బాయిని చూసుకునే బ్రతుకుతున్నానే గాని....నాకు వేరే లోక మేముంది? వాడి సుగుణమే గాని నా యోగ్యత లేదు. వాణ్ణి కాళ్ళకు మొక్కమని నేను అడిగానా? అడుగుతానా? అయితే పెళ్ళికి ముందు మాత్రం ఒకే ఒక్క మాట అడిగాను వాణ్ణి....మళ్ళీ ఎవ్వర్తో అనవు కదూ?"

"ఒట్టు...కాని నా మీద నమ్మకం లేదా?"

"నిన్ను నమ్మకుంటే భగవంతుణ్ణి నమ్మను. కొడుకుని నమ్ముతానే గానీ వాడి వయసుని మాత్రం నమ్మను. వాడికి మూడ్ బాగుంటుందనీ ఇంకే దుర్వ్యసనాలూ అలవాటు కావనీ చాలా రోజు లప్పుడే స్ట్రాంగ్ పిప్పరమెంట్లు అలవాటు చేశాలే. భోంచేశాక ఒకటి చప్పరిస్తాడు. అంతే"

"పిప్పరమెం ట్లేమిటమ్మా...."

"అవును. అదీ నా చేతి మాత్ర....పెళ్ళికి ముందు ఒకే మాట చెప్పా నంతే. అబ్బాయ్ .....ఎట్టి పరిస్థితి లోనూ పెళ్ళాంతో నువ్వు గడపాల్సింది ఎంత సేపో తెలుసా? నోట్లో పిప్పరమెంట్ కరిగి పోయేంత సేపు....అంతే" అన్నది జగదీశ్వరమ్మ.

పగలబడి నవ్వింది సుభద్రమ్మ.

"పిప్పరమెంట్లు భలే ఖర్చయి పోవూ?"

"రోజూ రాత్రి ఒకటే పిప్పరమెంటు. అలా అని ఒట్టు వేయించు కున్నాను. తెలుసుగా...వాడు నా మాట తప్పుతాడా?" అన్నదామె.

"హమ్మ...ఏం తెలివైన దానివి జగదీశ్వరమ్మా! భలే కమాండ్ చేస్తున్నావు..."

షాక్ మీద షాక్ తగిలి నట్లు నిద్రలో నడుస్తు న్నట్లు బొమ్మలా వెళ్ళి మర బొమ్మలా మేడ మెట్లెక్కి గదిలో కొచ్చి పడిపోయింది జయంతి.

చిన్న మాత్ర. చిన్న బిళ్ళ. పిప్పరమెంట్! స్ట్రాంగ్ పిప్పరమెంట్! ఎంత కుట్ర! ఎంత దగా! మోసం! ఇంకే మనాలి? ఇంకే మనవచ్చు?

అత్తలలో ఇటువంటి అత్తలు కూడా ఉంటారా?

గుండె చప్పుడు లోనే ఆలోచనల్ని అదిమేస్తూ....ఇంకా ఇంకా అర్థం చేసుకుంటూనే ఉంది జయంతి.

ఫైళ్ళు పక్కన పెట్టి లేచాడు సుందరం. అప్పుడే భార్య గుర్తొచ్చింది. అద్దంలో చూసుకుంటూ పక్కనే రాక్‌లో పిప్పరమెంట్స్ బాటిల్ కోసం చూశాడు. లేదు. అలవాటుగా అక్కడే పెడతాడు. ఎవరూ తాకరు. తనే హేండిల్ చేస్తాడు.

కింద అందరూ పడుకుని ఉంటారు. ఎవర్నీ అడగా లనిపించ లేదు. తచ్చాడుతూ గది నుంచి బైట కొచ్చాడు. అడుగుల శబ్దం విన్నట్టుగా అప్పుడే తన గది లోంచి తొంగి చూసింది జయంతి.

"పిప్పరమెంట్స్ బాటిల్ నా దగ్గ రుంది."

"నాదేనా! నువ్వు తీశావా?" అంటూ వెంటే వెళ్ళాడు.

"సారీ మిమ్మల్ని అడగలేదు. ఇందాకా....బోర్ కొట్టింది ....బాటిల్ తెచ్చు కున్నానా...టీవీ చూస్తూ రెండు చప్పరిం చేశాను....మంచి టేస్టు.... స్కూల్లో జామెట్రీ బాక్సులో మిఠాయిలూ, చాక్లెట్లూ దాచుకుని తినేవాళ్ళం....అదంతా గుర్తొ చ్చింది."

చనువుగా ఆమెను పొదువు కుంటూ నడిచాడు. అతని ఆర్ద్రతలో కపటం లేదు. "భలే సెంటిమెంట్స్ ఉన్నాయి నీకు....నీలాంటి భార్య దొరకడం అదృష్టం" అంటూ ఆమెతో బాటు బెడ్ మీద వాలి అల్లు కున్నాడు.

తొలకరి చిటపట వానలా ఇక్కడో ముద్దూ అక్కడో ముద్దూ. చినుకులకి ధూళి రేగితే భూమి ఎంత పులకిస్తుందో...మబ్బుకి తెలుసా? తెలియదా? అతను అంత సరదా హుషారులో కూడా చేయి సాచి తడుముకుం టున్నాడు. పిప్పరమెంట్స్ బాటిల్‌కోసం.

బాటిల్ అతనికి అందిస్తున్నట్టే చేయితిప్పి....అతని వీపు వెనుక బాటిల్ ఓపెన్ చేసి ఒక పిప్పరమెంట్ తీసి నాజూకుగా అతని పెదవుల మధ్య పెట్టింది.

అమృత గుళికలా అందుకున్నాడు అతను. అంతలో హఠాత్తుగా అతని నోటిని తన పెదవుల్తో అద్ది మూసేసి పెదవి మూలల్లో గొణిగింది. "ఇది నాకే ఇచ్చేయండి"

తంటాలు పడుతూ ఎలాగోలా పిప్పరమెంట్‌ని ఆమె నోట్లోకి చేర్చాడు.

అతని పెదవిని నాలుకను పిప్పరమెంట్‌ని ఒకసారి చప్పరిస్తూ "భలే టేస్టు " అని తియ్యగా మూలిగింది.

"మరి నాకు" అన్నాడతను.

వీపు వెనుక బాటిల్ నుంచి ఇంకో సారి పిప్పరమెంట్ తీసి అతని నోటిలో పెట్టింది.

ఇంత గొప్ప ముద్దు అత నెన్నడూ ఎరగడు. చిత్ర విచిత్రాల ముద్దుతో ఊపిరులు గుసగుసగా మెలిక పడ్డాయి.

స్కూలు పిల్లాడిలా పిప్పరమెంట్ చప్పరించిన వాడు క్షణాల్లో కాలేజీ కుర్రాడై పోయాడు. మరికొద్ది నిమిషాల్లో మహా యోధుడై పోయాడు.

"అయ్యో.....ఇంతసేపా?" అందామె గోముగా.

అతను నాలుకతో చప్పరించి పిప్పరమెంట్ తడుముకున్నాడు. "ఏం కాలేదు" అన్నాడు.

ఆమె నోట్లో పిప్పరమెంట్ ఎప్పుడో కరిగి పోయింది. సిగ్గు కరిగి పోయింది.

జాబిల్లి తరిగి పోయాడు. పిప్పరమెంట్ కన్నా స్ట్రాంగ్‌గా ఆమె కరిగి పోతూనే ఉంది. పదే పదే....

తెల్లవారే వేళ అతని ఎర్ర బారిన కళ్ళలో రెండు సూర్యోదయాలు చూసింది ఆమె. అంతం లేని అమృతంలో ఇంకా ఈదుతూనే ఉన్నాడు అతను.

ధళధళమని పొద్దు గుచ్చు తుండగా కళ్ళు చిట్లించి, ఆమె నుంచి తప్పుకో కుండానే నోటి లోంచి తీసుకున్నాడు.....రాత్రంతా కరగ కుండా అలాగే ఉండి పోయింది ఏమిటి ?

పిప్పరమెంట్ కాదు....

తెల్లటి బొత్తాము, షర్ట్ బటన్, కాస్త పెద్దది.

సూర్యుణ్ణి కొరికినట్టు....రాత్రంతా కాలాన్నే కరకర మని నమిలి చప్పరిం చేసినట్టు ...

ఆమె కుట్ర మెల్ల మెల్లగా అర్థమౌ తుండగా తల వారగా వంచి ఆమెను చూస్తూ చూస్తూ ఉండి గబుక్కున ముద్దుతో ఉక్కిరిబిక్కిరి చేశాడు.

"సారీ సారీ సారీ " అంటూ చేతులు జోడించింది జయంతి. "మీ పనులు చెడగొట్టను. తమాషాకి చేశాను. నన్ను మన్నించండి. మీరు రోజూ

పిప్పరమెంట్లే తినండి చాలు..."

"ఆఁ.."

"గుండీలు....నేను భరించలేను"

ఈ సారి ఆమె వైపు దీక్షగా చూశాడు.

"అమ్మ కిచ్చిన మాట తప్పను. కానీ ఆ మాట నెరవేర్చే డ్యూటీ నీది. బాటిల్ నీ దగ్గర ఉంటుంది. నా దృష్టిలో అది పిప్పరమెంట్స్ బాటిల్ ...నువ్వేదిస్తే ...అదే నాకు పిప్పరమెంట్..."

"ఆశ పాపం...గుండీ లివ్వా లంటే..... మంచి చేసుకోవాలి..." కొంటెగా నవ్వింది జయంతి.

27.09.1996 సంచిక